సాక్షి
కర్నూలు
గురువారం । 29 । మే । 2025



వేసవి శిబిరం.. విజ్ఞానం ఘనం

వేసవి సెలవుల్లో చిన్నారులు విజ్ఞానం పెంచుకుంటున్నారు. కొత్త అంశాలను నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇందుకు తల్లిదండ్రులు సహకరిస్తున్నారు. 8లో▸



అనాథల కోసం 'సాథి'

అనాథలకు చట్టపరమైన గుర్తింపు కోసం జాతీయ న్యాయసేవల అథారిటీ 'ఎస్‌ఏఏటీహెచ్ ఐ-సాథి' ని ప్రారంభించిందని జిల్లా కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి చెప్పారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,591.03
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 11.811
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,574
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 131

న్యూస్‌రీల్

నేడు సిల్వర్ సెట్ పరీక్ష

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కర్నూలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలకు గురువారం సిల్వర్ సెట్-2025 పరీక్ష నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలన్నారు. బీఎస్సీ గణితం స్ట్రీమ్ అలైడ్ కోర్సులకు 386, బీఎస్సీ లైఫ్ సైన్స్ అలైడ్ కోర్సులకు 175, బీకాం అలైడ్ కోర్సులకు 521, బీఏ అలైడ్ కోర్సులకు 114 మంది చొప్పున మొత్తం 1196 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

1,309 పింఛన్ల కోత

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ కింద జూన్ నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,50,577 పింఛన్లకు రూ.195.32 కోట్లు మంజూరయ్యాయి. మే నెలతో పోలిస్తే జూన్ నెలలో 1,309 పింఛన్లపై కోత పడింది. చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నెలనెలా గుట్టు చప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తున్న విషయం తెలిసిందే. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 31వ తేదీనే పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ వై.వి.రమణారెడ్డి తెలిపారు.

మహనీయుడు ఎన్టీఆర్



ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టిన మహనీయుడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కార్యక్రమం నిర్వహించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, కర్నూల నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, టూరిజం అధికారి విజయ, డీఈఓ శామ్యూల్‌పాల్, కార్పొరేటర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఎంపీడీఓలు, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీలో భాగంగా కూలీలకు పనులు కల్పించడంలో వెనుకబడిన హాలహర్వి, కౌతాళం, హొళగుంద, గోనెగండ్ల మండలాల ఎంపీడీఓలు, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా డ్వామా పీడీ వెంకటరమణను ఆదేశించారు. బుధవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీపై ఎంపీడీఓలు, ఏపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా మండలాల్లో కనీసం 40 శాతం పురోగతి చూపలేదన్నారు. మద్దికెర, సి.బెళగల్, తుగ్గలి, గూడూరు, పత్తికొండ, వెల్దుర్తి మండలాలు 60 శాతం పైగా పనులు కల్పించి మంచి పురోగతి సాధించాయన్నారు. మే మాసంలో 80 శాతం వరకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించినట్లయితే మిగిలిన లక్ష్యాలను సులువుగా సాధించవచ్చన్నారు. ఎమ్మిగనూరు, ఆస్పరి, ఆదోని, నందవరం, ఓర్వకల్లు, ఆలూరు, పెద్దకడుబూరు మండలాలు 50 శాతం లోపు లక్ష్యాలను సాధించాయని, పురోగతి సాధించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న 500 వరకు ఫాంపాండ్స్‌ను వెంటనే పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

హుండీ ఆదాయం రూ.67 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయ హుండీల్లో కానుకలను బుధవారం లెక్కించారు. మొత్తం 62 రోజులకు హుండీల ద్వారా రూ. 67,09,930 నగదు, 40. 60 మిల్లీ గ్రాముల బంగారు, 1.9 కేజీల వెండి వచ్చిందని దేవదాయశాఖ అధికారి జనార్ధన తెలిపారు. ఆలయ ఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధం.. ప్రాపగండం

- మార్కెట్‌ను ఆక్రమించిన పీడీసీ మందులు
- కొన్ని మెడికల్ షాపుల్లో కొనసాగుతున్న దందా
- బ్రాండెడ్ మందుల కంటే అధికంగా ఎమ్మార్పీలు
- భారీగా డిస్కౌండ్ ఇస్తున్నట్లు హంగామా
- నాణ్యత లేదని తేలితేనే చర్యలు ఉంటాయన్న అధికారులు



కర్నూలు(హాస్పిటల్): పీడీసీ(ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) మందులను కొన్ని మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. వాటిపై భారీగా ఎంఆర్‌పీలు ముద్రించి.. డిస్కౌంట్‌లు సైతం భారీగా ఇస్తున్నట్లు హంగామా చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు వేలకు పైగా రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. ఇందులో కర్నూలు నగరంలోనే అధికంగా ఉన్నాయి. ఇక్కడి నుంచే హోల్‌సేల్ దుకాణాల ద్వారా జిల్లాలోని నలుమూలల్లో ఉండే రిటైల్ దుకాణాలకు మందులు వెళ్తుంటాయి. అయితే ఇటీవల కాలంలో సొంతంగా మందులు తయారు చేయించుకుని విక్రయించే విధానం తెరపైకి వచ్చింది. అంటే మార్కెట్‌లో లభించే బ్రాండెడ్ మందులే గాకుండా మందులు తయారు చేసే కంపెనీలతో మాట్లాడుకుని వారికి అవసరమైన ఔషధాలను తయారు చేయించుకుని విక్రయించుకునే అవకాశం వచ్చింది.

నాణ్యత అనుమానమే!

పీడీసీ(ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) మందులను ఆయా ఫార్మాకంపెనీలతో మాట్లాడుకుని తయారు చేయించుకోవచ్చు. వాటిపై ఎంఆర్‌పీలు అవి తయారు చేయించుకునే వారి ఇష్టం. వాటిపై ఎంతైనా వేసుకోవచ్చు. ఎంతంటే బ్రాండెడ్ మందుల కంటే అధికంగా ఉండేటంత. ఏదైనా ఔషధాన్ని కనిపెట్టాలంటే సదరు ఫార్మా కంపెనీ ఎన్నో సంవత్సరాలు కష్టపడి తయారు చేస్తుంది. ఈ మేరకు కొన్ని నిర్ణీత సంవత్సరాల పాటు ఆ మందుకు పేటెంట్ తీసుకుంటుంది. ఆ పేటెంట్ కాలం ముగిసిన తర్వాత ఆ మందు ఫార్ములా తీసుకుని ఎవ్వరైనా తయారు చేసుకోవచ్చు. ఇతర బ్రాండెడ్ కంపెనీలతో పాటు ఊరు పేరు తెలియని కంపెనీలు కూడా మందులు తయారు చేసి జనంపైకి వదులుతున్నాయి. ఈ మేరకు భారీగా మందులపై ఎంఆర్‌పీలు ముద్రించి దోచుకుంటున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొన్ని ప్రధాన దుకాణాల్లో మందుల కొనుగోలుపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారు. కానీ వైద్యులకు అటాచ్డ్‌గా ఉన్న మందుల దుకాణాల్లో లభించే ఈ పీడీసీ మందులపై ఎలాంటి డిస్కౌంట్స్ ఉండవు. పైగా సదరు డాక్టర్ రాసిన మందులు అక్కడ మాత్రమే లభిస్తాయి. అయితే ఈ మందులు ఎంత మేరకు పనిచేస్తాయి. వాటి నాణ్యత ఎంత అనేది ప్రతి దాన్ని ల్యాబ్‌లో పరీక్షిస్తే గానీ తెలియని పరిస్థితి.

అ'ధన'పు లాభాలు

ఉదాహరణకు ఒక బ్రాండెడ్ ఔషధం ధర రూ.300లు ఉందంటే...అందులో కంపెనీకి సంబంధించి తయారీ ఖర్చులు, ప్రచార ఖర్చులు, మార్కెటింగ్ ఖర్చులు అన్నీ కలిపి ఉంటాయి. కానీ పీడీసీ కంపెనీకి ఇలాంటి ఖర్చులేమీ ఉండవు. ఆ మందులపై భారీగా తగ్గింపు ఉండాలి. అంటే ఆ ఔషధం రూ.100లోపు ఉండాలి. కానీ పీడీసీ విషయంలో మాత్రం ఆ మందు ధర రూ.400 నుంచి రూ.600 వరకు ఉంటోంది. దీనిని బట్టి ఈ మందులపై ఎంతమేరకు లాభం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు హోల్‌సేల్ ఏజెన్సీలు ఉన్న వారు ఇలాంటి మందులను వైద్యులున్న మెడికల్ షాపులకు పంపేవారు. ఇప్పుడు నేరుగా వైద్యులే ఏజెన్సీలు ఏర్పాటు చేసుకుని ఆ అదనపు లాభాలు కూడా వారే పొందుతున్నారు.

నకి'లీలలు'

- ఒకవైపు పీడీసీ మందుల దందా జోరుగా సాగుతున్న వేళ ఇమిటేషన్ డ్రగ్స్(నకిలీ) కొత్త వ్యాపారాన్ని ప్రారంభమైంది.
- మార్కెట్‌లో బాగా పేరున్న బ్రాండ్‌ల మందులను అచ్చుగుద్దినట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.
- గతంలో జాన్సన్ కంపెనీకి చెందిన అల్ట్రాసెట్ మాత్రలను విజయవాడ కేంద్రంగా తయారు చేసి తెలుగు రాష్ట్రాల్లో విక్రయించి పట్టుబడ్డారు.
- మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఓ వ్యక్తి అబాట్ కంపెనీ తయారు చేసిన థైరోనామ్ అనే థైరాయిడ్ టాబ్లెట్లను నకిలీవి తయారు చేసి విక్రయిస్తూ పట్టుబడ్డాడు.
- ఇటీవల కర్నూలులో ఓ దుకాణంలో సిస్టోపిక్ కంపెనీ గ్యాస్ట్రబుల్ కోసం తయారు చేసిన సైరా-డి అనే క్యాప్సుల్‌ను నకిలీగా తయారు చేశారు. ఎంఆర్‌పీ మాత్రం తప్పుగా ముద్రించి పట్టుబడ్డాడు.
- ఇటీవల కాలంలో నకిలీ మందుల వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. అచ్చుగుద్దినట్లు బ్రాండ్‌ను పోలి ఉండటంతో సామాన్య ప్రజలతో పాటు వ్యాపారులు కూడా గుర్తించలేని విధంగా ఆ మందులు ఉంటున్నాయి.

ఇలా చేయాలి..

నకిలీ మందుల మోసాలను అరికట్టేందుకు సదరు కంపెనీలు ఇటీవల మందుల స్ట్రిప్‌పై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నాయి. ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అవి నకిలీవా అసలువా అనేది తెలిసిపోతుంది.

భారీగా ఆఫర్లు

పీడీసీ మందుల క్రయ విక్రయాలు ఎక్కువ కావడం, పోటీ పెరగడంతో ప్రస్తుతం వాటిపై భారీ డిస్కౌంట్లు అందిస్తున్నారు. డాక్టర్ అటాచ్ కౌంటర్లలో ఈ మందులు ఎంఆర్‌పీకి ఇస్తుండగా, కొన్ని కార్పొరేట్ మందుల దుకాణాలు, స్థానిక ఏజెన్సీలు నేరుగా రిటైల్ దుకాణాలు ఏర్పాటు చేసి భారీగా డిస్కౌంట్లు ప్రకటిస్తున్నాయి. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కాలేజీ, రాజ్‌విహార్, పాతబస్టాండ్, వెంకటరమణ కాలనీ, కొత్తబస్టాండ్ వంటి ప్రాంతాల్లో షాపు బోర్డులపైనే 25శాతం వరకు డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు. పీడీసీ మందులు విక్రయించే దుకాణాలకు సైతం సదరు ఏజెన్సీలు భారీగా ఆఫర్లు ఇస్తున్నాయి. పది స్ట్రిప్పులు కొంటే పది ఫ్రీ అంటూ ఆఫర్లు ఇచ్చేస్తున్నారు.

కేసులు నమోదు చేశాం



మార్కెట్‌లో లభించే అన్ని మందుల కంపెనీలు అనుమతి తీసుకునే తయారు చేస్తాయి. వాటిపై ఎంఆర్‌పీలు ఆయా కంపెనీలు ఇష్టం. ఎంఆర్‌పీలు, డిస్కౌంట్‌లను ప్రశ్నించలేం. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. పీడీసీ మందుల నాణ్యతపై తరచూ శాంపిల్స్ తీసి పంపిస్తున్నాం. ఇందులో ఇటీవల నంద్యాలలో రెండు, ఆదోనిలో ఒక శాంపిల్ సబ్ స్టాండర్డ్(నాణ్యతా ప్రమాణాలు లేనివి) అని నివేదికలు వచ్చాయి. ఈ మేరకు ఆయా దుకాణాలు, కంపెనీలపై కేసులు నమోదు చేశాం.

–రమాదేవి, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ, కర్నూలు

తక్షణమే పొగాకు కొనుగోళ్లు చేపట్టండి



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో పేరుకుపోయిన పొగాకు నిల్వలను తక్షణం కొనుగోలు చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య పొగాకు కంపెనీలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పొగాకును కొనుగోలు చేయకపోతే వర్షాల కారణంగా నాణ్యత తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో ఎస్‌సీపీ(సిరి పొగాకు)కి సంబంధించిన కొనుగోలు కేంద్రాన్ని ఎక్కువ పంట పండించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని జీపీఐ కంపెనీని ఆదేశించారు. బీడీ పొగాకు, నాటు రకం పొగాకులను కూడా పూర్తిగా కొనుగోలు చేయాలని ఐటీసీ, జీపీఐ, వీఎస్‌టీ, ఆలియన్స్, పీటీపీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయాధికారి వరలక్ష్మీ, సహాయ సంచాలయకులు సాలురెడ్డి పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగాలి

కర్నూలు(సెంట్రల్): 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులందరినీ ఓటరుగా నమోదు చేయించాలని, ఈ ప్రక్రియను నిరంతరం కొనసాగించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువకులు, ట్రాన్స్‌జెండర్లను గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో ఓటర్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మాలిక్‌బాషా, పీటీ సాయిప్రదీప్, అరుణ్‌కుమార్, మంజనాథ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నిషా 'తూలుతోంది'!

అష్టాదశ శక్తిపీఠంలో అసాంఘిక కార్యకలాపాలు

- యథేచ్ఛగా శ్రీశైలంలోకి మద్యం అక్రమ సరఫరా
- దర్జాగా ఆర్టీసీ బస్సుల్లో తరలింపు
- ఏడాదిలో 60కి పైగా కేసులు నమోదు
- గుట్కా, సిగరెట్ల విక్రయాలూ షరా
- తరచూ పట్టుబడుతున్న పేకాటరాయుళ్లు



ఇటీవల శ్రీశైలం ఆలయానికి సమీపంలోని ఓ కాలనీలో దొరికిన మద్యం బాటిళ్లతో పోలీసులు



వారం క్రితం ఆర్టీసీ బస్సులో తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

శ్రీశైలం టెంపుల్: ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తి పీఠం కలగలసిన మహాపుణ్యక్షేత్రం 'శ్రీశైలం'. పరమ పవిత్రమైన ఈ క్షేత్ర పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూఅదుపు లేకుండాపోతోంది. ఇక్కడ తరచూ మద్యం బాటిళ్లు పట్టుబడుతుండటం, సిగరెట్లు, ఖైనీ, గుట్కా తదితర నిషేధిత వస్తువులు యథేచ్ఛగా విక్రయిస్తుండటం చూస్తే కూటమి ప్రభుత్వంలో ఆలయం ఏ స్థాయిలో నిర్లక్ష్యానికి లోనవుతుందో అర్థమవుతోంది. శ్రీశైలం శివారు ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని పేకాటరాయుళ్లు రెచ్చిపోతున్నారు. కొన్ని నెలల క్రితం ఆలయంలో విధులు నిర్వహించే తాత్కాలిక ఉద్యోగులతో పాటు పలువురు స్థానికులు పేకాట ఆడుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఉగాది ఉత్సవాల్లో సైతం క్షేత్ర పరిధిలో పేకాట ఆడుతుండగా పలువురు పట్టుబడ్డారు. నిత్యం ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడాల్సిన శ్రీశైల క్షేత్రంలో ఇలాంటి పరిణామాలు జరగడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే అక్రమ రవాణా

శ్రీశైల మహాక్షేత్రంలో టోల్‌గేట్ వద్ద ఆలయ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, హోంగార్డులు నిత్యం వాహనాలను తనిఖీ చేస్తుంటారు. తమ సొంత వాహనాలు, ప్రైవేట్ వాహనాల్లో మద్యం, నిషేధిత పదార్థాలను తరలిస్తే దొరికిపోతామని మద్యం వ్యాపారులు అక్రమ రవాణాకు ఆర్టీసీ బస్సులనే ఎంచుకుంటున్నారు. ప్రయాణికుల తరహాలో బస్సుల్లో ప్రయాణిస్తూ యథేచ్ఛగా మద్యం, తదితర నిషేధిత వస్తువులను తరలిస్తున్నారు. ఇలా ఏడాది కాలంలో 60కి పైగా మద్యం అక్రమ రవాణా కేసులు నమోదైనట్లు సమాచారం. గడచిన నెల వ్యవధిలోనే 10 కేసులు నమోదయ్యాయి. పోలీసుల కళ్లుగప్పి సాగుతున్న అక్రమ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. కొందరు పోలీసులు మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మద్యం, నాటుసారా తరలిస్తూ పట్టుబడిన వారిలో మహిళలే ఎక్కువగా ఉంటున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీశైలంలో నిరంతరం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం. క్షేత్రంలోకి మద్యం, నిషేధిత పదార్థాలు సరఫరా చేయకూడదు. విక్రయాలు జరపకూడదు. ఈ విషయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అనుమానాస్పద వ్యక్తులు, గృహాలను సైతం కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తాం.

– జి.ప్రసాదరావు, శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్

సుంకేసులకు స్వల్పంగా పెరిగిన వరద

కర్నూలు(సిటీ): తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతం, జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కురిసిన వర్షాలకు తుంగభద్ర నదికి బుధవారం వరద నీటి ప్రవాహం పెరిగింది. ఉదయం 9 గంటలకు 13,395 క్యూసెక్కుల వరదనీరు సుంకేసుల బ్యారేజీలోకి వచ్చి చేరగా 4 క్రస్టు గేట్లు మీటరు పైకెత్తి 13,236 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు బ్యారేజీలోకి వరదనీటి ప్రవాహం కొంత తగ్గింది. 8,917 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా 2 గేట్లు మీటరు పైకెత్తి 8,758 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 159 క్యూసెక్కుల నీరు కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాలువకు విడుదలవుతోంది.



తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం

తుంగభద్రకు..

నందవరం: కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ, తీర్థనహళ్లి, ఆగుంబే, బళ్లారి, వరినాడు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుడడంతో తుంగభద్ర నదికి వరద నీరు వస్తోంది. బుధవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో బ్రిడ్జి వద్ద తుంగభద్ర నది వరద నీరు ప్రవాహం పెరిగింది. నదికి వరద నీరు రావడంతో రైతులు ఖరీఫ్ సాగు సన్నద్ధమవుతున్నారు.

పొలంలోనే ఆగిన ఊపిరి

- విద్యుదాఘాతంతో రైతు మృతి



పిచ్చిగుంట్ల శంకరన్న (ఫైల్)

మంత్రాలయం: రెక్కల కష్టానికి రైతు పిచ్చగింట్లు శంకరన్న(45) ఎప్పుడూ భయడలేదు. పొలమే ప్రాణంగా జీవనం సాగిస్తూ వచ్చాయి. వివిధ పంటలు పండిస్తూ ఉండేవాడు. అయితే ఆ రైతును పొలంలోనే విద్యుత్ ప్రాణం తీసింది. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో మంత్రాలయం మండలం 52 బసాపురం గ్రామానికి చెందిన రైతు పిచ్చగింట్లు శంకరన్న, ఆయన భార్య పార్వతి బుధవారం పొలానికి గుంటక పాయడానికి వెళ్లారు. కరెంటు రావడంతో గుంటక పొస్తున్న శంకరయ్య బోరు మోటారు ఆన్ చేయడానికి బోరు దగ్గరకు వెళ్లాడు. అయితే బోరు మోటారు కనెక్షన్ విద్యుత్ తీగ డ్యామేజ్(అతుకులు) అయ్యింది. డ్యామేజ్ అయిన చోట అనుకోకుండా ఆ రైతు కాలు పెట్టడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. భర్త మృతి చెందడంతో భార్య పార్వతి శోకసంద్రంలో మునిగిపోయింది. శంకరన్నకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ వీరేష్ తెలిపారు.

ప్రయాణికుల కస్సుబస్సు!

బస్సులన్నీ మహానాడుకే!

- గ్రామీణ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రజల అవస్థలు
- జిల్లా నుంచి 200 బస్సులకు పైగా మహానాడుకు తరలింపు
- ప్రైవేటు స్కూల్ బస్సులను సైతం వదలని టీడీపీ



కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



బస్టాండ్‌లో ప్రయాణికుల నిరీక్షణ



బస్సులో ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

కర్నూలు(సిటీ): కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడుకు ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో ఆ పార్టీ కార్యకర్తలను తరలించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను వినియోగించబోమని ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక మహానాడుకు జిల్లాలోని వివిధ డిపోలకు చెందిన 200 ఆర్టీసీ బస్సులను తరలించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్టీసీ బస్సులు లేకపోవడం, సుదూర ప్రాంతాలకు చెందిన బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

ఇవీ ఇబ్బందులు..

- బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో వేలాది మంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లేందుకు ప్రయత్నించారు.
- ప్రైవేటు వాహనదారులు సైతం అడ్డగోలుగా ప్రయాణ చార్జీలు పెంచి వసూలు చేశారు.
- జిల్లాలోని వివిధ డిపోల్లో 360 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. వీటిలో 200 బస్సులకు పైగా మహానాడుకు మళ్లించారు. అందుబాటులో ఉన్న అరకొర బస్సుల్లో ప్రయాణానికి ప్రజలు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది.
- జిల్లా కేంద్రం నుంచి సుదూర ప్రాంతాలకు ప్రయాణించేందుకు ముందస్తుగా టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణికులకు సైతం రిజర్వేషన్లు రద్దు చేశారు.



రాత్రి అయినా బస్సులు లేకపోవడంతో కర్నూలు బస్టాండ్‌లో వేచి చూస్తున్న ప్రయాణికులు

అంతటా అశ్రద్ధ

- తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులను తరలించడంలో ఉన్న శ్రద్ధ అందుబాటులో ఉన్న బస్సుల ద్వారా గ్రామీణ, మారుమూల, సుదూర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులను తరలించే విషయంలో ఆర్టీసీ అధికారులు ఏమాత్రం శ్రద్ధ వహించలేదు.
- కనీసం ఉన్న బస్సులను సైతం నడిపేందుకు ఆయా డిపోలకు చెందిన అధికారులతో సమన్వయం చేయలేదు. ప్రయాణికుల ఇబ్బందులను కొందరు అధికారులు ఆర్ఎం దృష్టికి తీసుకుపోయినా ఏమాత్రం పట్టించుకోలేదని తెలుస్తోంది.
- మహానాడుకు తరలించేలా ఆయా స్కూళ్ల, కాలేజీల యాజమాన్యాలకు చెప్పి బస్సులను పంపించాలని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ కార్యాలయం నుంచి ఫోన్ చేసి ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా నుంచి సుమారు 187 బస్సులను బలవంతంగా టీడీపీ మహానాడుకు తీసుకెళ్లిపోయారు.



డోరులో ప్రమాదకరంగా ప్రయాణం



బస్సు కోసం పరుగు..

క్లుప్తంగా

ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు కౌన్సెలింగ్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గిర్వానీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బుధవారం మొదటి విడత కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గిర్వానీ మాట్లాడుతూ..ఇంటర్ మొదటిసంవత్సరంలో ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థినులకు మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసినట్లు చెప్పారు. మూడు రోజులుగా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.కౌన్సెలింగ్‌కు అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థినులు హాజరైనట్లు చెప్పారు. రెండవవిడత కౌన్సెలింగ్ తేదీని ఇంకా నిర్ణయించలేదని,త్వరలో తెలుస్తుందని వెల్లడించారు.

వడ్డీ రేటు టెండర్ల పరిశీలన



టెండర్లను పరిశీలిస్తున్న ఏఈఓ, సూపరింటెండెంట్‌లు

మహానంది: మహానందీశ్వర స్వామి దేవస్థానానికి చెందిన సుమారు రూ.40 కోట్ల మొత్తాన్ని బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసేందుకు వడ్డీ రేట్లను కోరుతూ బుధవారం సీల్డు టెండర్లు నిర్వహించారు. ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, క్యాషియర్ నాగభూషణం ఆధ్వర్యంలో స్థానిక దేవస్థానం కార్యాలయంలో సీల్డు టెండర్లు తెరిచారు. ఈ సందర్భంగా ఏపీజీబీ వారు ఏడాదికి రూ.7.90 శాతం, ఎస్బీఐ 6.85 శాతం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ.20 కోట్లకు పైగా డిపాజిట్ ఉంటే 7.20 శాతం వడ్డీ రేట్లను సూచిస్తూ కోట్ చేశారు. వీటిపై ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని ఏఈఓ మధు తెలిపారు. ఆయా బ్యాంకు శాఖల మేనేజర్లు రాఘవయాదవ్, హరీష్‌కుమార్, తిమ్మప్ప పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం ప్యాకెట్లను ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేస్తున్న పోలీసులు

మంత్రాలయం: మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన అక్రమ మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. బుధవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈఎస్‌టీఎఫ్ రామకృష్ణారెడ్డి, మంత్రాలయం సీఐ రామాంజులు నేతృత్వంలో నాగలదిన్నె రోడ్డులో మద్యాన్ని నిర్వీర్యం చేశారు. 3,606 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లు ట్రాక్టర్‌తో తొక్కించారు. వాటి విలువ రూ.1,44,240 ఉంటుందని ఆయా శాఖల అధికారులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులపై నిరంతర దాడులు చేపడతామన్నారు.

వినోదాల వేసవి శిబిరం.. విజ్ఞానం ఘనం

- చిన్నారుల ఇష్టానికి విలువ.. బంగారు భవితకు బాట
- ఆట విడుపుగా పలు అంశాల్లో తర్ఫీదు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 260 కేంద్రాల్లో శిక్షణ
- చదువుతో పాటు పలు అంశాల్లో శిక్షణ
- ఉత్సాహంగా పాల్గొంటున్న చిన్నారులు



నాటకం ప్రదర్శిస్తున్న చిన్నారులు



చిన్మయ మిషన్‌లో నృత్య సాధన చేస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: వేసవి సెలవులను వృథా చేయకుండా కొత్త అంశాలను నేర్చుకునేందుకు చిన్నారులు ఉత్సాహం చూపుతున్నారు. వారి అభీష్టానికి అనుగుణంగా తల్లిదండ్రులు సహకరిస్తున్నారు. చిన్నారుల ఇష్టానికి అనుగుణంగా పలు శిక్షణా సంస్థలు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ వారి సృజనకు పదును పెడుతున్నాయి. సంవత్సరమంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన బాలబాలికలు వేసవి సెలవుల్లో ఉత్సాహంగా గడుపుతూ, విజ్ఞానంతో పాటు వినోదం పొందుతున్నారు. పిల్లల అభిరుచులకు తగిన విధంగా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, యోగా, ధ్యానం, స్విమ్మింగ్, భగవద్గీత పఠనం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పెయింటింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ లాంటి వివిధ అంశాలతో పాటు ప్రతిభకు పదును పెట్టేలా వేసవి శిక్షణా శిబిరాల్లో మెళకువలు నేర్పుతున్నారు. కొన్ని సంస్థలు ఉచితంగా.. మరి కొన్ని సంస్థలు నామమాత్రపు రుసుంతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో చిన్నారులు విజ్ఞానంతో పాటు వినోదం పొందుతున్నారు.

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక శిబిరాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేసవి శిక్షణ శిబిరాలు కళకళలాడుతున్నాయి. కర్నూలు నగరంతో పాటు, నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాలతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. సుమారు 260 సంస్థలు వివిధ అంశాల్లో తర్ఫీదును ఇస్తున్నాయి. సెలవుల్లో నెల రోజుల పాటు విద్యార్థులకు వివిధ అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సమయం సద్వినియోగంతో పాటు చిన్నారుల్లో విజ్ఞాన వినోదాంశాలు పెంపొందిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం చిన్నారుల అభిరుచికి తగ్గట్లు సమ్మర్ క్యాంప్‌లను ఎంపిక చేసి అందులో శిక్షణ ఇప్పిస్తున్నారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరాలు చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. జిల్లాలోని అన్ని గ్రంథాలయ శాఖల్లో సైతం ప్రభుత్వ ఆదేశాలతో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. కర్నూలు నగరంలో చిన్మయ మిషన్, ఇస్కాన్, టీజీవీ కళాక్షేత్రం, నృత్యజ్యోతి, ఐరిస్ ఫ్లారెట్స్, సత్యసాయి సంస్థ, నైస్ సంస్థ, నంద్యాల కళారాధ, ఆదోని కళారాధన సంస్థల్లో శిక్షణ ఇస్తున్నారు.



ఇస్కాన్ సమ్మర్ క్యాంప్‌కు హాజరైన విద్యార్థులు

వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది



సమ్మర్ క్యాంప్‌లో చిన్నారుల వ్యక్తిత్వ వికాసం పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నాం. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఏటా వేసవి శిబిరం నిర్వహిస్తున్నాం. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వివిధ అంశాలను నేర్చుకుంటున్నారు. భగవద్గీత శ్లోకాలు, వేదం, యోగ, నృత్యం, హనుమాన్ చాలీసా తదితర అంశాలను నేర్పిస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి మంచి సహకారం ఉంది.

– స్వామిని సుప్రేమానంద సరస్వతి, చిన్మయ మిషన్

ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణం



ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రహ్లాదుని బడి పేరుతో ఏటా మూడు వారాల పాటు రెండు విడతలుగా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. మృదంగం, అన్నమయ్య కీర్తనలు, భగవద్గీత శ్లోకాలు, జపం, చిత్రలేఖనం, కళ, క్రాఫ్ట్, కరతాళాలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. ఇలాంటి తరగతులకు హాజరు కావడం వల్ల చిన్నారుల్లో ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణం జరుగుతుంది.

– రఘునందన సేవక్ ప్రభు, ఇస్కాన్ ప్రవచకులు

కొత్త విషయాలు నేర్చుకుంటున్నా



జిల్లా గ్రంథాలయ సంస్థలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నాను. సెలవులు చాలా సరదాగా గడిచిపోతున్నాయి. క్యాంప్‌కు హాజరు కావడంతో అనేక కొత్త విషయాలపై అవగాహన కలుగుతోంది. పెద్దలతో ఎలా మెలగాలి, తోటి వారితో ఎలా ప్రవర్తించాలనే విషయాలు నేర్పించారు. సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, బుక్ రీడింగ్‌లో మెళకువలు తెలిశాయి.

– రిజుదాస్, 9వ తరగతి విద్యార్థి

సెలవులు సద్వినియోగం



వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొనడంతో కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. వాటిలో శిక్షణ తీసుకోవడంతో సెలవులు సద్వినియోగం అవుతున్నాయి. క్యాంప్‌లో పాల్గొనడంతో స్కూల్ ఫ్రెండ్స్‌తో పాటు చాలా మంది కొత్తవారు ఫ్రెండ్స్ అయ్యారు. వినోదంతో పాటు వి జ్ఞానం పొందుతున్నాం. తెలియని విషయాలు తెలుసుకుంటున్నాం. కొత్త అంశాల్లో శిక్షణ పొందేందుకు మా తల్లిదండ్రులు క్యాంప్‌కు పంపడం ఆనందంగా ఉంది.

– వేదశ్రీ, 6వ తరగతి విద్యార్థిని

అనాథలకు గుర్తింపు కోసం 'సాథి'



అధికారులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని అనాథలకు చట్టపరమైన గుర్తింపు కోసం తగిన చర్యలు తీసుకోవాలని లీగల్ సర్వీసు అథారిటీ జిల్లా కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి అధికారులను ఆదేశించారు. బుధవారం కోర్టు ప్రాంగణంలోని న్యాయసదన్‌లో.. అనాథలను గుర్తించడంపై పలు లైవ్ డిపార్టుమెంట్లకు చెందిన అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 మే 13న జాతీయ న్యాయసేవల అథారిటీ సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్ టు ట్రాకింగ్ అండ్ హోలిస్టిక్ ఇంక్లూజన్ (ఎస్‌ఏఏటీహెచ్‌ఐ–సాథి)ను ప్రారంభించిందని చెప్పారు. అనాథలను గుర్తించి ఆధార్ నమోదు చేయడం, చట్టపరమైన సహాయం, సంక్షేమ పథకాలను అందించడం సాథి ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ క్రమంలో అనాథలకు సాయం చేసేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చైర్మన్‌గా జిల్లా స్థాయి సాథి కమిటీని ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ కమిటీ అనాథలను గుర్తించి ఆధార్ ఎన్‌రోల్ చేయించే బాధ్యతను తీసుకోవాలన్నారు. అనాథ పిల్లలు కనిపిస్తే 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పాలని కోరారు. డీఎంహెచ్‌ఓలు శాంతికళ, వెంకటరమణ, డీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ రాజేశ్వరి, డీసీపీఓ శారద, నంద్యాల డీఈఓ జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే అన్ని రకాల పనులపై ఇక నుంచి మరింత పకడ్బందీగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ ఆదేశించారు. ఉపాధి నిధులతో చేపట్టే పనుల్లో అవినీతి అక్రమాలకు తావు ఉండరాదని, ఉంటే వాటిని ఎండగట్టాలన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన ఎస్‌ఆర్‌పీలు, డీఆర్‌పీలు, జిల్లాకు చెందిన ఏపీడీలు, ఏపీఓ తదితరులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఉపాధి నిధులతో చేపట్టిన పనులు వంద శాతం పారదర్శకంగా జరగాలనేది ప్రధాన ఉద్దేశమని, ఇందుకు అనుగుణంగా సామాజిక తనిఖీలు నిర్వహించాలన్నారు. సామాజిక తనిఖీల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, నిజాయితీగా ఉంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఏవైనా ఒత్తిళ్లు వస్తే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. వంద శాతం మార్గదర్శకాలకు అనుగుణంగా సోషల్ ఆడిట్ జరగాలని, ఇటీవలి కాలంలో కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వాటికి అవకాశం ఇవ్వరాదని సూచించారు. ఏపీడీలు, ఏపీఎంలు ఇతర ఉపాధి సిబ్బంది సోషల్ ఆడిట్‌కు అన్ని విధాలా సహకరించాలన్నారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, ఏపీడీలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

శిరివెళ్ల: కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం యర్రగుడికి చెందిన యువకుడు శేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య బుధవారం తెలిపారు. యువకుడు శిరివెళ్ల మండలం కోటపాడులో తన బంధువు ఇంట్లో ఉండి వరిగడ్డి కట్టలు కట్టే మిషన్ పనులు చేసుకుంటూ చేసుకుంటున్నాడు. ఈ నెల 19వ తేదీన మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మృతిచెందిన రాజశేఖర

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ గ్రామం వద్ద బొలెరో టెంపో వాహనం, మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో హాల్వి గ్రామానికి చెందిన మటపతి రాజశేఖర (45) అనే వ్యక్తి మృతి చెందినట్లు పెద్దతుంబళం పోలీసులు బుధవారం తెలిపారు. మటపతి రాజశేఖర వ్యవసాయ కూలీ అని, అతని కుమారుడిని వేద పాండిత్య పరీక్షలకు సంతకుడ్లూరులో వదిలి తిరిగి సొంత గ్రామమైన హాల్వికి బైక్ (ఏపీ 21 ఏడీ 5291)పై వస్తుండగా కుప్పగల్ గ్రామ సమీపంలో బొలెరో టెంపో (కేఏ 07బీ 6108) వాహనం బొప్పాయి లోడుతో ఆదోనివైపు వస్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం



మృతిచెందిన దస్తగిరి

బొమ్మలసత్రం: పట్టణ శివారు జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని పంట పొలాల్లో దస్తగిరి (73) అనే వృద్ధుడు బుధవారం పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తాలుకా సీఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన దస్తగిరి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా ఆరోగ్యం సరికాకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ స్థితిలో బుధవారం నంద్యాల పట్టణానికి చేరుకొని నూనెపల్లి సమీపంలో పురుగు మందు కొనుగోలు చేశాడు. అక్కడి సమీపంలోని జర్నలిస్ట్ కాలనీ పక్కనున్న పంట పొలాల్లోకి వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాసేపటికి స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సీమ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

నంద్యాల(న్యూటౌన్): రాయలసీమలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్-6 హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాల పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాయలసీమకు నీటి వనరులైన హంద్రీ – నీవా, గాలేరునగరి, సిద్దేశ్వరం అలుగు, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేసేలా మహానాడులో తీర్మానం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రాంతీయ పార్టీలను భయపెడుతోందని, ప్రజలను మభ్యపెట్టి కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతుందని ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయలేదో మహానాడులో నిలదీయాలన్నారు. ఆగస్టు 22 నుంచి 25 వరకు ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను, చండీఘర్‌లో సెప్టెంబర్ 25, 26 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యజమాని ఇంటి వద్ద మృతదేహంతో నిరసన



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని నాపరాతి గనిలో విద్యుత్ షాక్ గురై మృతి చెందిన బోయ నాగేశ్వర రావు మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం గని యజమాని కొండయ్య ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీన నాగేశ్వర రావు కొండయ్యకు చెందిన నాపరాతి గనిలోకి పనిలోకి వెళ్లాడు. కోత మిషన్‌కు కరెంట్ సరఫరా కావడం లేదని కొండయ్య, అతని కుమారుడు శ్రీరాములు చెప్పడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి కరెంట్ తీగ తగలించే సమయంలో ప్రమాదం బారిన పడ్డాడు. చికిత్స కోసం మొదట కర్నూలుకు, అక్కడి నుంచి తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 26వ తేదీన నాగేశ్వర రావు మృతి చెందాడు. మృతుడి భార్య నాగేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గని యజమాని కొండయ్య, కుమారుడు శ్రీరాములుపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చాక కుటుంబ సభ్యులు, బంధువులు అంత్యక్రియలకు తీసుకెళ్లకుండా గని యజమాని ఇంటి ముందు ఉంచి నిరసనకు దిగారు. నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడినా ఫలితం లేకపోయింది. న్యాయం జరిగే వరకు మృతదేహం ఇక్కడే ఉంటుందని తేల్చిచెప్పారు. చివరకు సీఐ రమేష్‌బాబు వారికి సర్దిచెప్పి మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేలా చేశారు.

ఆర్టీసీ బస్సుపై గంటతో దాడి







గంట విసరడంతో పగిలిన బస్సు అద్దం, దాడికి ఉపయోగించిన గంట, గాయపడిన భవిష్య

- ప్రయాణికురాలికి గాయాలు

వెల్దుర్తి: పట్టణ సమీపంలో హైవే– 44లో వెళుతున్న ఆర్టీసీ బస్సుపై గుర్తు తెలియని వ్యక్తులు గుడి గంటను విసరడంతో ఓ ప్రయాణికురాలికి గాయాలయ్యాయి. వివరాలు.. మదనపల్లె డిపోకు చెందిన ఏపీఎస్‌ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు (ఏపీ 40 జెడ్ 0612) హైదరాబాద్ నుంచి మదనపల్లెకు వెళుతూ అర్ధరాత్రి 12 గంటల సమీపంలో వెల్దుర్తి మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె దాటింది. అక్కడి అమెజాన్ కిచెన్స్, లిమ్రాస్ ఫ్యాక్టరీ సమీపంలో వెళుతుండగా బస్సు నాల్గవ సీటు విండోపై గుడి గంట పడటంతో అద్దం బద్దలైంది. ఆ సీటులో కూర్చున్న కదిరికి చెందిన భవిష్య (17) తలకు గంట తగిలి తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న డ్రైవర్ మల్లికార్జున దారి దోపిడీ దొంగల పనిగా భావించి బస్సును ఆపకుండా కొద్ది దూరం వెళ్లి ఓ టీస్టాల్ వద్ద నిలిపాడు. వారి ద్వారా ఆసుపత్రి వివరాలు తెలుసుకుని వెల్దుర్తి సీహెచ్‌సీకి బస్సును తీసుకొచ్చారు. గాయపడ్డ భవిష్యకు వైద్యులు చికిత్స అందించారు. గాయమైన చోట తలకు మూడు కుట్లు పడ్డాయి. డ్రైవర్ ఇచ్చిన సమాచారంతో హైవే పోలీసులు, నైట్ డ్యూటీ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. గుడి గంటపై చిన్న మద్దయ్య, అలుగుందార్ అని చెక్కబడి ఉంది. కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్పిన్నింగ్ మిల్లు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

ఆదోని రూరల్: రాయలసీమ స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా స్థానిక రాయచోటి రామయ్య కాలనీలోని యాజమాన్యం వారి ఇంటి వద్ద బుధవారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మిల్లు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వెంకప్ప, కార్మికులు మాట్లాడుతూ.. మిల్లు మూతబడి 25 సంవత్సరాలవుతున్నా దాదాపుగా 150 మంది కార్మికులకు గ్రాట్యూటీ, పీఎఫ్, పెన్షన్ తదితర సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. వీటి కోసం కార్మికులు అనేక సంవత్సరాలుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. యాజమాన్యానికి ప్రధాన రాజకీయ పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికులకు పెండింగ్ బకాయిలు, పీఎఫ్ చెల్లించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు సొరప్ప, నారాయణ, భీమలింగప్ప, మిల్లు కార్మికులు ఖాదర్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ కృషి సంకల్ప్ యాత్రలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ పంటల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన పెంచేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి జూన్ 12వ తేదీ వరకు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి మండలంలో కనీసం రెండు, మూడు గ్రామాల్లో ఈ యాత్ర చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో యాత్ర జరుగుతుంది. కేవీకే ప్రోగ్రాం అధికారి రాఘవేంద్రప్రసాద్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. బనగానపల్లి యాగంటిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతుల అవగాహన యాత్ర జరుగుతుంది. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ధనలక్ష్మి నంద్యాల జిల్లాకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. యాత్రలో భాగంగా ఖరీఫ్ సన్నాహక వ్యవసాయ ప్రణాళికలు, కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని నోడల్ అధికారులు ప్రకటించారు. భారత చిరుధాన్య పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కర్నూలు జిల్లాలో దాదాపు 100 గ్రామాలు, నంద్యాల జిల్లాలో 135 గ్రామాల్లో ఈ యాత్ర కార్యక్రమాలు జరుగుతాయి. రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో రాణించాలని అధికారులు సూచించారు.

చీటింగ్ కేసు నమోదు

కర్నూలు(టౌన్): కర్నూలు మండలం ఉల్చాల గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తిపై నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. శేఖర్ ఉల్చాల గ్రామ సమీపంలో తనకు పొలం ఉందని చెప్పి నగరంలోని వాసవీనగర్‌కు చెందిన మజీద్‌ను నమ్మించి రూ.29 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకొని రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఇబ్బంది పెడుతున్నాడు. అనుమానం కలిగిన మజీద్ అసలు పొలం ఉందా, లేదా అని విచారణ జరిపగా ఆ పొలాన్ని అంతకుముందే ఇతరులకు విక్రయించినట్లు తేలింది. దీంతో శేఖర్ తనను మోసం చేసినట్లు మజీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.